# కుమారసంభవం

గాంధారదేశంలో హరిదత్తుడనే బ్రాహ్మణు డుండేవాడు. అతను వేద వేదాంగాలు, ఉపనిషత్తులు, పురాణాలు ఆమూలాగ్రం పఠించాడు. తర్క, వ్యాకరణ, మీమాంసాది శాస్త్రాలు అతనికి కరతలామలకాలు. దీనికితోడు సిరిసంపదలు కూడా ఉన్నాయి. ఆ కాలంలో అతనిని మించిన విద్యావేత్త గాంధార దేశం మొత్తంలో లేడు.

ఆ కారణాన వందలాది విద్యార్థులు అతనివద్ద విద్య నభ్యసిస్తూ ఉండేవారు. అందుకుగాను అతను చిల్లిగవ్వయినా పుచ్చుకునేవాడు కాడు. కాకపోగా, విద్యార్థులందరికీ భోజన భాజనాదులు, తన యింటనే ఏర్పాటు చేయించేవాడు. అతని భార్యసైతం, ఉత్తమురాలే! ఒక్క విషయంలో కూడా, భర్తకు ఎదురుచెప్పేది కాదు. భర్తమాట జవ దాటటమంటే ఏమిటో ఇందుముఖికి అర్థం కాదనడం అతిశయోక్తి కాదు.

ఇన్ని ఉన్నా, హరిదత్తునికి గర్వమనేమాట ఏకోశానా

లేదు. ఇదంతా తన ప్రయోజకత్వం కాదంటాడు. పరమేశ్వరానుగ్రహం వల్లనే తను, ఇటువంటి స్థితిలో ఉన్నానంటాడు. ఇది అతని ఉత్తమత్వానికి చిహ్నంగా ప్రజలు భావించారు.

హరిదత్తుని జీవితం అత్యంత నియమబద్ధమైనది. ఏ వేళకు ఏ పని చేయాలో, ఆవేళకు ఆ పని విధిగా చేసేవాడు. ఏ అవాంతరం వచ్చినా అతని విధానంలో మార్పుంటూ ఉండేదిగాదు. అతన్నిచూసి, ఆనాటి ప్రజలు తమతమ దైనిక కృత్యాలలో పాల్గొంటూ వుండేవారట !

ఒకనాటి రాత్రి హరిదత్తుడు, శిష్యులకు పాఠాలుచెప్పి, లోపలికొచ్చాడు. వ్రాతబల్ల, తాటియాకులు గంటము సిద్ధం చేసుకొన్నాడు. గత రాత్రి వ్రాసివిడిచిన, వ్యాకరణ సూత్రాలను పూర్తిచేద్దామని కూచున్నాడు. కానీ ఎంత వెదికినా, గత రాత్రి తను వ్రాసిన ఆకు బొత్తి కనిపించలేదు. అన్ని గదులూ వెదికాడు. ఇందుముఖిచేత వెదికించాడు. శిష్యుల చేత వెదికించాడు. కానీ కనిపించలేదు. అయితే ఏమయినట్టు? ఉత్తముడు గనుక, ఎవ్వరినీ అనుమానించలేదు. తనే ఎక్కడో పెట్టి మరిచివుంటాడు. ఎక్కడ మరిచివుంటాడు ? ఎప్పుడు ?

క్రిందటి రాత్రి వ్రాతపతి భద్రంచేసినప్పటినుండీ, ఈ క్షణంవరకూ గల కార్యక్రమాన్నంతటినీ జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. ఉదయం - దేవతార్చన సమయంలో వున్నది. మధ్యాహ్నం, భోజనానంతరంగూడా వున్నది. సాయంత్రం -

అవును. తను సాయంత్రం శివాలయానికి వెడుతూ ప్రతిని వెంట తీసుకెళ్ళాడు. లేఖక దోషాలు లేమయినావుంటే, సవరించు కొందామన్న అభిప్రాయంతో ఆపని చేశాడు. ఏదో సవరించాడు కూడాను. బాపుంది. అయితే, తిరిగి వస్తున్నప్పుడు, ఆ ప్రతిని వెంటతీసుకొచ్చాడా? హరిదత్తుడు శాంతంగా ఆలోచించాడు. తీసుకురాలేదు. తెచ్చినట్లయితే, ఆ పీఠంమీద వుంచేవాడు. కొన్ని దశాబ్దాలనుండీ, వ్రాతప్రతులను, ఆ పీఠంమీద వుంచడం రివాజు. ఆ అభ్యాసం ఈనాడు తప్పుతుందనుకోవడం అవివేకం !

హరిదత్తుడు వ్రాతప్రతికోసం శివాలయానికి స్వయంగా బయలుదేరాడు. శిష్యులు అడ్డుతగిలారు. తామే తెస్తామనీ, మీరు ఈ అపరాత్రివేళ, అంతదూరం పోనవసరం లేదనీ అన్నారు. కానీ హరిదత్తు డంగీకరించలేదు. తన కార్యంకోసం మరొకరిని ఇబ్బందిపెట్టటం భావ్యంకాదు. అందులోనూ నిద్ర వేళ సమీపించింది. విద్యార్థులు, ఆ వేళకు విధిగా నిద్ర పోవలసిందే! నియమోల్లంఘనం జరగటానికి వల్లకాదు. శిష్యుల్ని వారించి తనే బైలుదేరాడు.

నవమి వెన్నెల నీడలు ఆకాశంలో జీరాడుతున్నాయి. మందపవనం వెన్నెల జల్లును చిందకొడుతున్నది. హరిదత్తుడు త్వరితంగా శివాలయం ప్రవేశించాడు. తలుపులు దఢాలున తెరచి, లోపలికి అడుగెట్టబోయాడు. అంతే! మరి అడుగు కదలలేదు. లోపల పార్వతీ పరమేశ్వరులు 'క్రీడా వినోదం'లో

వున్నారు. పరమేశ్వరుడు పానవట్టానికి జారగిలబడి వున్నాడు. ఒక మూలగా త్రిశూలం ఆనించబడి వుంది. నెలవంక ప్రక్కకు వరిగిపోయింది. పార్వతీమాయి, భర్త ఒడిలో పడుకొని తలను శంకరుని తొడమీద పెట్టుకొని రెండు చేతులూ శంకరుని కంఠానికి పెనవైచి, ముందుకు లాక్కొంటున్నది. మదనాంతకుడు, పార్వతీదేవిని తనమీదకి తీసుకొంటున్నాడు.

హరిదత్తుణ్ని ముందుగా చూచింది పార్వతీదేవే! ఆ తల్లి ఉలిక్కిపడి, చివాలునలేచి నిలుచుంది. వస్త్రం సరిచేసుకొంది. ఒక మూలగా వున్న కంచుకంకోసం చాటుకెళ్ళింది. ఈ హఠాత్సంఘటనతో, శంకరుని 'మైకం' వీడిపోయింది. తత్తరపాటుతో లేచి, పార్వతివేపుగా వెళ్ళాడు. పార్వతి వాకిలివేపు - కనుసైగ చేసిందాకా, హరిదత్తుణ్ని చూడనే లేదు.

చూసిన తరువాత శంకరుడు పడ్డపాట్లు వర్ణనాతీతం. ఇంచుమించు పిచ్చివాడులా ప్రవర్తించాడు. శపిస్తానన్నాడు. త్రిశూలంతో పొడుస్తానన్నాడు. బూడిదపాలు చేస్తానన్నాడు. మూడవ నేత్రం ఒకటి-రెండుసార్లు విచ్చుకోబోయి, తిరిగి యథాతథంగా మూసుకు పోయింది.

హరిదత్తుడు సాష్టాంగ దండ ప్రణామా లాచరించాడు. తెలియక వచ్చానన్నాడు. నువ్వు భక్త సులభుడి వన్నాడు. శంకరుడు పెదవి కదపలేదు. పార్వతివేపు చూశాడు.

'పాపం!' అన్నది పార్వతి, 'తెలియక చేశానంటున్నాడు. ఈసారికి క్షమించండి'

'క్షమించడమా?' అని గర్జించాడు రుద్రుడు. 'వీణ్ణి... వీణ్ణి... ఈ నీచుణ్ణి...'

ఆవేశంతో—పాపం—సరిగ్గా మాటలుగూడా అనలేక పోయాడు శివుడు.

'పండితుడు, అందునా బ్రాహ్మణుడు. మీాదు మిక్కిలి ఉత్తముడు. మన భక్తుడు. మీారు క్షమించకపోతే ఎలా?'

'కనుకనే విధిగా శిక్షించాలి. పామరులు, తెలియక తప్పుచేస్తారు. అవి క్షమార్హాలవుతాయి. కానీ పండితులు బుద్ధిపూర్వకంగా చేస్తారు. వాటిని క్షమించడానికి వీలులేదు. క్షమించడమంటే, కొందరు చేస్తున్న దోషాలను ఆమోదించడమన్న మాటే! దోషమనేది జరగకుండానే ఉండాలిగాని, జరిగిన తరువాత ఫలితం అనుభవించ వలసిందే! వీడు తెలీక చేశాడనడం అర్థరహితం. మహాపండితుడు, ఈ వేళప్పుడు ఎవరెలా ఉంటారో తెలియని జడుడు కాదు. బుద్ధిపూర్వకంగా, మనల నిలా అవమానించాలనే వచ్చాడు...'

పార్వతి అడ్డుతగిలి ఏదో చెప్పబోయింది. హరిదత్తుడు గోలుగోలున ఏడుస్తూ శంకరుని కాళ్ళు పట్టుకొన్నాడు. అయినా శంకరుడివేమీా ఖాతరు చెయ్యలేదు. శాప మివ్వాలసిందే నన్నాడు.

'సరే మీా యిష్టం!' అన్నది పార్వతి.

శంకరుడు ఘోరంగా శపించాడు.

'స్వామీ! శాపవిమోచనం ప్రసాదించరా?' అన్నాడు హారిదత్తుడు, విచారాన్ని దిగ్రమింగి.

'పదహారు ఘడియలలో నీకు కుష్ఠురోగం ప్రాప్తించడం తప్పదు...నీ వంశాన్ని ఉద్ధరించేందుకు పుత్రుడు జన్మించిన తరువాతగానీ నీకు ఈ శాపవిముక్తికాదు. వెళ్ళు' అన్నాడు శివుడు.

* * *

ఈ సంగతులన్నీ విని ఇందుముఖి ఖేదించింది. హారిదత్తుడు భార్యను ఓదార్చాడు.

'పిచ్చిదానా! ఏడ్చి లాభంలేదు. విధివ్రాత నెవరు తప్పిస్తారు? అలా జరగవలసి ఉన్నది; జరిగింది. దీనికెవ్వరూ కర్తలుకారు...ఇందుముఖీ! ఇంతకాలం నామాట జవదాట లేదు. ఇప్పుడూ ఆ సాంప్రదాయాన్ని నిలబెట్టు కొంటావనే నమ్ముతున్నాను...' అన్నాడు హారిదత్తుడు.

'నన్నేం చెయ్యమంటారు?' అన్నది ఇందుముఖి ఏడుపు దిగ్రమింగుకొని, 'మీకోసం అగ్నిలోనైనా దూకుతాను'

'ఉత్తమురాలివి' అన్నాడు హారిదత్తుడు. 'తూర్పున వెలుగురేఖలతోబాటే, నాకా మహావ్యాధిగూడా వస్తుంది. శాప విమోచనం నీకు తెలుసుగదా! పుత్రునికోసం ప్రయత్నించు. హేయాతి హేయమైన ఈ కుష్ఠువ్యాధి పీడితుడు అందుకు అనర్హుడు. నీ ఆరోగ్యాన్ని, యౌవనాన్ని, సౌంద ర్యాన్ని, నాకోసం అర్పితం చేయటం అవివేక మనిపించు

కొంటుంది. కాకపోయినా ప్రస్తుతం నాకవి నిరుపయోగమే! నువ్వు నా మంచినికోరేదానివి! నా విముక్తికై ప్రయత్నించు. ఫలితం నీమీద ఆధారపడి ఉన్నది.'

ఇందుముఖి పిచ్చిదయిపోయింది. ఇప్పుడు తను చేయవలసిందేమిటి? ధ్యేయం గుర్తుకు తెచ్చుకుంది. గడగడ వణికిపోయింది. అవమానభారంతో ఉంగలు చుట్టుకొంది. తన మనస్సు ఆ నీచకార్యంవేపు మొగ్గటంలేదు. కానీ, ఇది నీచ కార్యమా? అవుగాక. అందువల్ల తన భర్త తనకు లభిస్తాడు. తన సంసారం తనకు దక్కుతుంది. అందుకోసం తను చెయ్యవలసిన త్యాగం సాధారణమైనది కాదు. తన శీలాన్ని తనే బలిపెట్టాలి. ఉత్తమ స్త్రీకి ఇది లక్షణమా? కానిమాట నిజమేగానీ, అందువల్ల భర్త పునర్జీవితు డౌతాడు. తనకు తన శీలం ముఖ్యమా? భర్త ముఖ్యమా?

ఇందుముఖి చాలాసేపు ఆలోచించింది. హరిదత్తుడే ముఖ్యమన్న నిర్ణయాని కొచ్చింది. తను 'నైతిక పతనం' చెందటంతో, ఒక మహాపండితుడు, మహామేధావి, లోకానికి దక్కుతాడు. అతనివల్ల ఎందరో విద్యావంతులు కావచ్చు. ఎన్నో వినూత్న గ్రంథాలు వెలయవచ్చు. అపారమైన లాభాలు లోకానికి కలగవచ్చు. తను శీలం ప్రధానంగా భావించిన పక్షాన, బాగుపడేది తనొక్కతే. తనవల్ల లోకానికి ఎటువంటి లాభమూ ఉండదు. కాగా, తన 'పతనం'తో ఇన్ని ఉపయోగ కార్యాలు జరుగుతున్నప్పుడు, తను ఏమైనా, విచారణీయం కాదు.

ఈ నిశ్చయాన్ని భర్త కెరిగించింది. హరిదత్తుడు చాలా సంతోషించాడు. ఆమె ప్రయాణానికి త్వరత్వరగా సన్నాహాలు పూర్తిచేశాడు.

తొలికోడి కూసింది.

'ఇక బయలుదేరు' అన్నాడు హరిదత్తుడు. 'తెల్లవారిన తరువాత, ఈ శరీరాన్ని నువ్వు చూడలేవు. చూడటం నా అభిమతం కాదు. త్వరగా వెళ్ళు. నీకు శుభం కలగాలని దేవదేవుని ప్రార్థిస్తున్నాను.'

ఇందుముఖి లేచింది. దుఃఖం దిగమింగుకొంది. భర్త పాదాలు కళ్ళకద్దుకొంది. కొన్ని క్షణాలు అతని ముఖంలోకి చూసింది. కుష్ఠువ్యాధి పీడితునిరూపం అతనిలో ఊహించుకొని కంపించిపోయింది. భరాలున వెనుదిరిగి, గుమ్మం దాటింది.

హరిదత్తుడు దీర్ఘంగా నిట్టూర్చాడు.

## 2

ఒకప్పుడు వారి వంశం చాలా గొప్పదే! ఎన్నో చిన్న రాజ్యాలు, వారికి కప్పంగట్టుతూ, అణిగి మణిగి మసలుతుండేవి. శత్రు రాజులకు వారి రాజ్యమంటే సింహస్వప్నం.

అపారమైన సైనికబలం వారికుండేది. కాకలు దీరిన అమాత్యులు కంటికి రెప్పలా రాజ్యాన్ని కాపాడుతూ ఉండేవారు. ఎందరో మహాపండితులు, గాంధర్వోపాసకులు, కళాకారులు, సంస్థానం నిండా బిలబిల లాడుతుండేవారు. అవసరమయిన పట్టుదల ఎంత క్రూరంగా ఉండేదో, అంత కరుణామయంగానూ ఉండగలదని వారి వంశానికి పేరుండేది.

నిజమే!

అవన్నీ ఒకప్పటి మాటలు...సామంతులు పన్నులు చెల్లింప నిరాకరించారు. సైనికులు స్వరాజ్యం మీదికే ఎదురు తిరిగారు. అమాత్యులు ధన లోభులయి రాజ్య విచ్ఛిత్తికి కారకులైనారు. బెల్లం ఉన్నచోట చీమలుంటాయి. సంస్థానం విచ్చిపోవడంతో, పండిత ప్రకాండులు, తదితర కళాకారులు, పొట్ట చేతపట్టుకొని మరొక రాజు నాశ్రయించ బోయారు.

కేతవర్మ యుక్తవయస్సు నాటికి ఉన్న పరిస్థితి ఇదీ! రాజ్యం లేదు సరిగదా, దినవెచ్చానికే కటకట పడవలసిన పరిస్థితి ఏర్పడింది. అదృష్టవశాత్తూ అతను విద్యావంతుడు. మీదు మిక్కిలి సద్వంశ సంజాతుడు. ఈ రెండు యోగ్యతలూ అతన్ని ఆదుకొన్నాయి. లేని పక్షాన కేతవర్మ మట్టి కొట్టుకు పోయేవాడు.

తండ్రి తాతలనుండీ ఎరిగివున్నవాడు కావటంవల్ల,

లక్షసింహుడు స్వయంగా పిలిపించి కేతవర్మకు ఉద్యోగమిచ్చాడు. నిజానికిదేమీ పెద్ద ఉద్యోగం కాదు; అవసరమయిందీ కాదు. ఉట్రవుడియంగా కేతవర్మకు సహాయపడటం—రాజ్యాంగదృష్ట్యా మంచిదికాదు. అందుకని అత కాణ్ణి అరణ్యపాలకునిగా నియమించటం జరిగింది.

లక్షసింహుని రాజ్యం ఆ అరణ్యంతో అంతమొందుతుంది. సరిహద్దుల్లో అలాంటి అరణ్యాలుండటం, రాజ్యభద్రతకు మంచిది కాదు. శత్రుసైనికుల కా అరణ్యాలు ఆటపట్టులు కావచ్చు. అప్పుడు తన కన్ను తన వ్రేలితోనే పొడుచుకొన్నట్లవుతుంది. అయినా లక్షసింహుని కా భయాం ఏ కోశానా లేదు. సరిహద్దురాజ్యం తన పెదతండ్రిగారిదే! ఈ రెండు వంశాలమధ్యా ఇంతవరకు పొరపొచ్చెమంటూ లేదు. కానీ తగు జాగ్రత్తల్లో వుండటం తప్పుకాదే! ఈ దృష్ట్యా గూడా కేతవర్మ కా వుద్యోగమివ్వడం సమర్థనీయమని లక్షసింహుడు భావించాడు.

ఒకనాడు కేతవర్మ హయారూఢుడై సరిహద్దుప్రాంతం పర్యటిస్తున్నాడు. ఒకచోట ఒక వ్యక్తి పడివుండటం చూశాడు. ఆతురతతో గుర్రందిగి దగ్గరకెళ్ళాడు. ప్రాణం వున్నది. అయితే సొమ్మసిలిపోయింది. కేతవర్మ ఆ మనిషికి ఉపచారాలు చేశాడు. అతని శ్రమ ఫలించింది. ఆ మనిషి కళ్ళు తెరిచింది. ప్రయత్నపూర్వకంగా లేచి కూచుంది. కృతజ్ఞతా సూచకంగా నమస్కరించింది.

'మీకు నేను చేసినసాయం చాలా స్వల్పం.' అన్నాడు కేతవర్మ.

'అలా అనకండి' అన్నదామె. 'ఇటువంటి విలువలు నిర్ణయించటం కష్టం! మీ దృష్టిలో ఇది స్వల్పమే కావచ్చు. కానీ ఈ స్వల్పసాయమే లేకపోతే, నే నేమయి వుండేదాన్ని? ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టటం సామాన్య కార్యంకాదు.'

See next page

కేతవర్మ మాట్లాడలేదు.

ఇందుముఖి అన్ని సంగతులూ చెప్పింది.

'నా భర్త ముఖం ఎటువంటిదో నే నెరుగను. చిన్నతనంలోనే నాకు పెళ్ళి చేశారు. వివాహానంతరం, ఆయనగారు కాశీ వెళ్ళారు. మా లెఖ్ఖప్రకారం విద్యా పరిసమాప్తి ఇప్పటికెప్పుడో ముగిసిపోయి వుండాలి. అయినా నా భర్త తిరిగి రాలేదు. వారికోసం - దాదాపు దేశమంతా గాలించాము. ఎక్కడా ఆనవాలులేదు. కొందరు చనిపోయారన్నారు; మరికొందరు సన్యసించారన్నారు. ఏది ఏమయినా నేను మాత్రం భర్తృవిహీననే! అలాగే మొన్న మొన్నటి వరకూ కాలం వెళ్ళదీసుకొచ్చాను. ఇటీవలే నా తలిదండ్రులు చనిపోయారు. ఆశ్రయంలేని ఆ ఊళ్ళో వుండటంకన్నా, మరొక ఆశ్రయం వెదుక్కోవటం మంచిదని బయలుదేరాను. చాలా దూరంనుండి, అన్న పానీయాలు లేకుండా ప్రయాణం చేయటంవల్ల స్పృహతప్పి పడిపోయాను. కానీ...' అని కన్నీరు పెట్టుకొంది ఇందుముఖి.

కేతవర్మ ఊరడించాడు.

'నన్ను రక్షించి మీరు అపకారమే చేశారంటున్నాను. క్షమించండి. అలా వదిలి వెళ్ళినట్లయితే, మరి కొంతసేపటికి, ప్రాణాలే నన్ను వదిలివెళ్ళేవి. అప్పుడిక ఏ బాధా వుండేదికాదు. బతికించి, కొసకు నన్ను కష్టాలపాలు చేశారు...' అన్నది ఇందుముఖి.

'విచారించకండి' అన్నాడు కేతవర్మ. 'కష్టాలు నీటి మబ్బుల్లాంటివి. ఎల్లకాలం వుండవు. ఎప్పుడో ఒకప్పుడు మబ్బులు ప్రిదిలిపోతాయి. తప్పదు. మీకేమీ అభ్యంతరం లేకపోతే నేనొక మాటంటాను...'

'ఏమిటది?' అన్నట్టు ముఖం పెట్టిందామె.

'మీకు మరేవిధమైన అభ్యంతరమూ లేకపోతేనే సుమా—మా యింట్లో వుండవచ్చు; నన్ను మరొకలాగ అర్థం చేసుకోకండి.'

ఇందుముఖి వదనం ప్రఫుల్లమైంది. మరో మాట లేకుండా అతనివెంట బయలుదేరింది.

* * * *

వారాలు, నెలలు గడిచాయి. ఇందుముఖి అక్కడి నుంచి కదిలే ప్రయత్నంలో లేదు. అలా లేకుండా వుండాలనే కేతవర్మ వాంఛిస్తున్నాడు. ఎందుకంటే, అతనిలో ఇటీవల చాలా మార్పులు వచ్చాయి. వచ్చాయని అతనుగూడా

అంగీకరిస్తున్నాడు. చాలాకాలం అతనికి స్త్రీ సాహచర్య మంటే ఏమిటో తెలియకుండానే గడిచిపోయింది. అప్పు డదంత బాధాకరంగా లేదు. ఇందుముఖి ప్రవేశంతో పరిస్థితి తలకిందులైంది. అతనికి సంబంధించిన ప్రతివిషయంపైనా ఆమెగారి పర్యవేక్షణ వుండి తీరుతున్నది. ఇదిగూడా అంత ముఖ్యంకాదు. దాస దాసీజనం – ఆ పని చూడటానికి లేక పోలేదు. కానీ ఇందుముఖి చూడటంలో ఏదో ప్రత్యేకత గోచరిస్తున్నది. అది 'ఫలానా' అని తను చెప్పుకోలేకపోతు న్నాడు. అంతమాత్రాన యథార్థం యథార్థం గాకుండా పోదు.

దాస దాసిజనం ఇప్పటికే వారిద్దరికీ బంధుత్వ మంట గట్టారు. కాదని ఇందుముఖి అనలేదు, కేతవర్మగూడా అన లేదు. దీనినిబట్టి ఇందుముఖి మనస్సు ఎలా ఉన్నదో గ్రహించే అవకాశం కేతవర్మకు లభించింది. అతడా అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాడు. కొంచెం సాహ సంతో కూడినదే అవుగాక – ఇందుముఖి తనను ప్రేమిస్తున్న దని భావించాడు. అందుకే తనను విడిచివెళ్ళే ప్రయత్నా లేమీ ఆవిడ చేయడం లేదనుకొన్నాడు. ఇక తను రవంత ముందడుగు వేయడమే ఆలస్యమనీ, అప్పుడు అటో, ఇటో స్పష్టంగా తేలిపోతుందనీ అనుకొన్నాడు.

ఆలోచనకూ ఆచరణకూ ఎక్కువ అంతరాన్ని సహించలేని వాడు కేతవర్మ. ఒకనాడు తెగించి ఇందుముఖిని

అడిగాడు. ఆమె కొన్నిక్షణాలు మౌనంగా ఉండిపోయింది. తరువాత మెల్లగా నవ్వింది. మౌనం సంపూర్ణాంగీకారం క్రింద తీసుకొన్నాడు కేతవర్మ. ఉప్పెనగా ఆనందం ఉప్పొంగింది. ప్రత్యామ్నాయంగా ఇందుముఖిని ఆలింగనం చేసుకొని ముద్దు పెట్టుకొన్నాడు. ఆమె నిస్సంకోచంగా అతని కౌగిలిలోనికి ఇమిడిపోయింది. అలా కావడానికి ముందు, భారంగా నిట్టూర్చిన విషయం, కేతవర్మకు తెలియనే తెలియదు.

## 3

నాలుగేళ్ళు గడిచాయి. చెప్పుకోదగ్గదేమీ జరుగలేదు.

ఒకనాడు ఇందుముఖి చంకన బిడ్డనెత్తుకొని వీధి వాకిట నిలబడి ఉన్నది. పిల్లడు కేరింతాలు కొడుతున్నాడు. తల్లి వాడి ముద్దు చేష్టలు చూసి మురుసుకొంటున్నది. ఉన్నట్టుండి ఇందుముఖి ఉలిక్కిపడ్డది. ఏదో జ్ఞాపకం అంటబొడిచి ఉండాలి. అదే జరిగింది. ఎదురయిన వాళ్ళను ఏదో అడుగుతూ హరిదత్తుడు ఇటుకేసే వస్తున్నాడు. ఇందుముఖి లజ్జతో మెలికలు తిరిగిపోయింది. తత్తరపాటుతో అడుగులు

తడబడ్డాయి. కళ్ళు నీటితో నిండిపోయాయి. పెదవులమీద మందహాసం మోసులెత్తింది. సమీపిస్తున్న భర్తను ససంభ్రమంగా చూచింది. గుండెలు గుబులుగుబులు మన్నాయి. ఎక్కడా కుష్ఠువ్యాధి చిహ్నం లేదు. కాగా ఇంకా ఆరోగ్యంగా, దృఢంగా, అందంగా ఉన్నాడు. ముఖం బ్రహ్మవర్చస్సు లీనుతున్నది.

హరిదత్తుడు మెట్లెక్కాడు. భార్యను సంభ్రమంగా చూచాడు. చంకలో బిడ్డ కేరింతాలు కొడుతున్నాడు. హరిదత్తుడు బాధతో ముడుచుకు పోయినట్లయినాడు. ఇందుముఖి భర్తను లోనికాహ్వానించింది. సకలోపచారాలూ చేసింది. తన పరిస్థితినంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

హరిదత్తుడు నిశ్వసించాడు.

'నా వ్యాధి దాదాపు మూడు సంవత్సరాల క్రిందటే రహితమయింది. అప్పుడే నీకు కుమారుడు కలిగాడనుకొన్నాను. అప్పటినుండీ నీ కోసం వెదకడం ప్రారంభించాను. మన రాజ్యమంతా గాలించాను. నీ ఆనవాలైనా దొరకలేదు. ఇక దొరకవని, నిరాశ చేసుకొన్నాను. మూడు రోజుల క్రిందట కొందరు బాటసారులు నిన్ను గురించి అనుకోవడం విన్నాను. ఇలా పరుగెత్తుకొచ్చాను... సరే! అంతా సలక్షణంగా ఉన్నది. మరి పద! మన ఊరు చేరుకొందాం' అన్నాడు హరిదత్తుడు.

ఇందుముఖి ప్రయాణ సన్నాహం పూర్తి చేసింది. అప్పుడే వచ్చిన కేతవర్మకు, భర్తను పరిచయం చేసింది.

'చాలాకాలం ఇందుముఖిని మీరు ఆదరించారు. ధన్యవాదాలు. మరి మాకు సెలవిప్పించండి. వెడతాము' అన్నాడు హరిదత్తుడు.

కేతవర్మ ముఖం పాలిపోయింది. ఇటువంటి సంఘటన నెదుర్కొనవలసి వస్తుందని, అతనెప్పుడూ ఊహించలేదు. ఇందుముఖి శాశ్వతంగా తనదయి పోతుందనుకొన్నాడు. ఆమెతో స్వర్గ సుఖాలనుభవించ వచ్చునుకొన్నాడు. అన్నీ తల్లక్రిందు లయినాయి. తనిప్పుడు ఇందుముఖిని ఉండమని కోరడం భావ్యంకాదు. ఒకవేళ కోరినా ఇందుముఖి అంగీకరించే ధోరణిలో లేదు. తను మర్యాదగా ఒప్పుకోవటమే ఉత్తమ మార్గం.

కేతవర్మ లేని సంతోషాన్ని ప్రకటించి, ప్రయాణానికి బండి సిద్ధం చేయించాడు. హరిదత్తుడు బండి నెక్కాడు. చంక బిడ్డతో ఇందుముఖి గూడా ఎక్కబోయింది. కేతవర్మ వారించాడు.

'ఏమిటిది?' అన్నది ఇందుముఖి.

'బిడ్డను నాకిచ్చి వెళ్ళు' అన్నాడు కేతవర్మ.

'అదెలా సాధ్యం? నా బిడ్డను నీ కెలా ఇవ్వను?' అన్నది ఇందుముఖి.

'నీ కేకాదు; వీడు నాకూ బిడ్డడే అవుతాడు. ఇతగాడి మీద నీకున్న అధికారం నాకూ వున్నది. ఆమాటకొస్తే

ఎక్కువ హక్కున్నవాణ్ని నేనే! కాదనకు. వేళ మించి పోతూంది. బిడ్డనిలా ఇచ్చి నువ్వెళ్ళవచ్చు.'

'నే నివ్వను' అన్నది ఇందుముఖి, బిడ్డను గట్టిగా రొమ్ముల కొత్తుకొని.

'అయితే మీ ప్రయాణం ఆగిపోవలసి వస్తుంది.' అన్నాడు కేతవర్మ.

హరిదత్తుడే బండి దిగి రాజీ చేయవలసివచ్చింది. బిడ్డడు ఎవరికి చెందవలసిందీ అతనుగూడా చెప్పలేక పోయి నాడు. ధర్మమూర్తియని పేరుబడ్డ లక్షసింహుని తీర్పుకు కట్టుబడి వుంటామని ఇరువురిచేతా మాట తీసుకుని, బండిని రాజధానివైపు పోనిమ్మన్నాడు హరిదత్తుడు.

*    *    *    *

సభా భవనంలో అప్పటికే వేలాది ప్రజ చేరింది. ఇంకా కొందరు వస్తున్నారు. రాజభటులు సర్ది కూచోబెడు తున్నారు. ఈ చిక్కు సమస్యను లక్షసింహుడెట్లా పరిష్కరిస్తాడా అని దూరదూరాలనుండీ జనం వచ్చి, సభాస్థలిని చేరుతున్నది.

మామూలు కంటే ఆనాడు లక్షసింహుడు 'కిటుకు' కనిపెట్టే సభకు వచ్చాడన్న వదంతి ప్రజలలో ఎగబ్రాకింది.

లక్షసింహుడు లేచి, సభలో సద్దు చేయవద్దని సైగ చేసి, వాది ప్రతివాదులను రావించి, మీ మీ వాదనలను తెలియ జేయమన్నాడు.

ముందుగా కేతవర్మ ఇలా అన్నాడు :

'ప్రభూ ! నా ఉద్యోగం తమకు, ఈ ప్రజలకు తెలియు నిదికాదు. ఒకనాడు నేను ఉద్యోగ ధర్మాన్ననుసరించి హయారూఢుణ్ణయి వెడుతున్నాను. త్రోవలో నా కొక కొయ్యపెట్టె కనిపించింది. దాని యజమానికోసం వెదికాను. ఎక్కడా కనిపించలేదు. వచ్చినవాడు ఇచ్చివేదామని, నే నా మందసాన్ని ఇంటికి తెచ్చుకొన్నాను. కొంతకాలంపాటు, అది నాయింట నిరుపయోగంగా పడివున్నది. దాని యజ మాని గూడా రాలేదు. అందుకని నా దగ్గరున్న వెలలేని రత్నాలు, అందులో దాచుకొన్నాను. ఇది జరిగి నాలు గేళ్ళవుతుంది. అప్పటినుండి ఇప్పటిదాకా, ఆ మందసం, నా రక్షణలోనే ఉన్నది... దాని యజమాని వచ్చాడు. ఆ కొయ్యపెట్టె తనదేనని రుజువుచేసుకొన్నాడు. నేను సంతో షంతో ఇచ్చి వేశాను. అందుకు యజమాని సంతోషించక, అందులోని రత్నాలుగూడా కావాలని పట్టుపడుతున్నాడు. అది భావ్యం కాదని చెప్పినా వినిపించుకోవటంలేదు. నిజానికి అతనే నాకు ఋణపడి వున్నాడని మనవి! ఇంతకాలం అతని వస్తువు చెడకుండా కాపాడాను. కృతజ్ఞత చెప్పడానికి బదులు, నా ఆస్తినిగూడా కాజెయ్యాలని చూస్తున్నాడు. పెట్టెలో దాచే రత్నాలుగూడా అతని కివ్వమని మీరనగలరా? ధర్మము జయించుగాక !!' అని కేతవర్మ విరమించాడు.

లక్షసింహుని దృక్కులు ఇందుముఖి మీద ప్రస రించాయి.

ఇందుముఖి ఇలా అన్నది:

'ధర్మమూర్తీ!' అన్నదామె గొంతు సవరించుకొని. 'మేము సుఖంగా బ్రతికినవాళ్ళం. పాడిపంటలు సమృద్ధిగా వున్న కుటుంబం మాది. అనివార్య కారణాల వలన మా జీవితంలో ఒడిదుడుకులొచ్చాయి. అన్నిటితోబాటు పాడిపంటలు గూడా దెబ్బతిన్నాయి. ఆ సంవత్సరం విత్తనాలకుగూడా లేకుండా ధాన్యం ఖర్చయిపోయింది. ఉదారుడైన పొరుగు వ్యక్తినుండి, కొంత ధాన్యం తీసుకున్నాము. అలా ఇచ్చినందుకు, అతనికి మా ధన్యవాదాలు. ఆ సంవత్సరం, పుష్కలంగా పంటపండింది. పొరుగువానికి కన్నుకుట్టింది. పంటంతా తనకే రావాలని మూర్ఖంగా పట్టుబడుతున్నాడు. అతని అవివేకానికి నవ్వాలో, జాలిపడాలో బోధపడటంలేదు. కొంత సాయంచేశాడు గనక, ఫలసాయమంతా అతనే పొందడం కేవలం అన్యాయం. ధర్మబుద్ధితో సాయంచేశాడను కొంటాముగానీ, ఫలితం ఆశిస్తాడనుకోము గదా! పోనీ— కావాలంటే, తన సాయానికి ఇబ్బడిముబ్బడిగా మరొక రూపంలో ప్రతిఫలం కోరటం న్యాయంకావచ్చు. కానీ పండిన పంటంతా, తనకే ధారాదత్తం చేయాలని అతగాడు వాదిస్తున్నాడు. న్యాయాన్యాయాలు విచారించండి. ధర్మము రక్షిత మవుగాక—'

లక్షసింహుడు ముఖంమీది చెమట బిందువులు తుడుచుకొన్నాడు. గొంతు సరిచేసుకొన్నాడు. అతడేమి

చెబుతాడా అని - సభ ఆతృతతో ఎదురు చూస్తున్నది. లక్షసింహుని ముఖంమీద హాసరేఖ ఉదయించింది.

'ఈ బిడ్డ—'

* * * *

[అంతే! కథ అయిపోయింది. లక్షసింహుడు చేసిన తీర్పేమిటోనని నేనూ ఆసక్తితో అన్వేషించాను. చాలా కాలంనాటి తాటి ఆకులు గావడంవల్ల అక్షరాలు అస్పష్టంగా నైనా కనిపించలేదు. కొన్ని ఆకులు చెదతిని నుగ్గు నుగ్గు అయిపోయాయి. దాదాపు అయిదారు ఆకులు పోయివుంటా యని నా అభిప్రాయం. రచయిత పేరుకోసం నే నెంతో శ్రమపడ్డాను. ముందు ఒక్కగానొక్క ఆకు పోయిందని, ఆకులమీది సంఖ్యనుబట్టి తెలుస్తున్నది. బహుశః రచయిత నామధేయం, ఆ పత్రంమీద ఉండిపుంటుంది. మూడవ పత్రపు ప్రథమ భాగంలో, 'నే రచింపబోవు ఇతిహాసమునకుఁ గథాక్రమం బెట్టిదనిన...' అన్న వాక్యమున్నది. దానికి కొంచెం పై భాగంలో, రాజరాజ నరేంద్రుని స్తుతిస్తూ ఉన్న మత్తేభ వృత్తంలోని చివరి రెండు పాదాలూ వున్నాయి. దానినిబట్టి ఈ రచయిత నన్నయకు సమకాలీను డని నిర్ణయించుకొన్నాను. ఆనాడు సైతం కథా సాహిత్యా నికి అధిక గౌరవముండే దనటానికి, ఈ ఇతివృత్తం ఓ పెద్ద ఉదాహరణ. ముగింపు ఎలా జరిగిందోనన్న తహ తహతో,

నేను చాలా రోజులు, ఆ శిథిల భాగంకోసం ప్రయత్నించాను. ఎందరికో ఉత్తరాలు వ్రాశాను. ఎందరినో సంప్రదించాను. ఎన్నో తాళపత్ర గ్రంథాలను శోధించాను. కానీ ముగింపు లభించలేదు.

అంతమాత్రాన, అంతటితోనే కథ ఆఖరయి వుంటుందని, నే ననుకోలేదు. లక్షసింహుడు 'ఈ బిడ్డ—' అనడంతో కథ ఆఖరవదు. ఆ బిడ్డ ఎవరిదో తీర్పు చెబుతాడు. ఆ తీర్పు అత్యంత ధర్మబద్ధంగాకూడా ఉండివుంటుంది. ఏ ఆధారంతో లక్షసింహుడు చెబుతాడా అని - నేను దీర్ఘకాలం ఆలోచించాను. రెండు పక్షాల వాదనలూ సముచితంగా వున్నాయి; బలంగానూ వున్నాయి. ఉన్నాయని, ఇద్దరిదీ న్యాయమయి వుండదుగదా! ఏ ఒక్కరిదో అవుతుంది. ఆ ఒక్కరూ ఎవ్వరు? ఎందుచేత వారిదే న్యాయమవుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తే ముగింపు లభించినట్లే! ఏదోవిధంగా ముగింపు చేదామని ఒకటి రెండుసార్లు ప్రయత్నించాను. కష్టమని కాదుగానీ - ఆ ముగింపు ఎంతవరకు సమర్థనీయమో ఎలా చెప్పడం? మూల రచయిత ఏ ట్రిక్‌తో కథ ముగింపు చేశాడో మనమెలా ఊహించడం?

ఈ కథ చదివే అవకాశం కలిగిన పాఠకులు, మూల గ్రంథాన్నికూడా చూడడం తటస్థపడితే, దయచేసి నాకు తెలియచేయండి. కథా శీర్షికగూడా నేనే వుంచాను. కథలో

కీలకమైనచోట్ల 'కుమార సంభవం' అన్న ప్రయోగం జాగ్రత్తగా వాడబడ్డది, దీనిసిబట్టి కథ పేరు 'కుమార సంభవం' అయి వుంటుందని భావించాను. ఇంతకన్న భావస్ఫోరక మైన పేరే మూల రచయిత పెట్టి వుండవచ్చు. అది ప్రస్తుతం నాకు అలభ్యం. దురదృష్టవశాత్తూ ఇంతకన్న ఎక్కువ వివరాలు దీనినిగురించి ఇవ్వలేకపోతున్నాము. జిజ్ఞాసువులైన పాఠకులు, ఆ కొరతను తీర్చగలరని విశ్వసిస్తున్నాను.